క్లుప్తంగా

బీజేవైఎం బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న సతీశ్

నిజాంపేట(మెదక్): బీజేవైఎం బలోపేతానికి కృషి చేయాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్ అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేవైఎం యువ మోర్చా అధ్యక్షుడు పోన్నబోయిన ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. బీజేవైఎం బలోపేతానికి బూత్ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరేశ్ మహంకాళి, ప్రశాంత్‌గౌడ్, శ్రీకాంత్, మావురం లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, బూత్ అధ్యక్షులు కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

శివ్వంపేట(నర్సాపూర్): వర్షానికి ఇళ్లు కూలిన బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కందికొండ అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లు కూలిన కుటుంబాలకు పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ఇచ్చిన ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు.

పాఠశాల ఆవరణలో వర్షపునీరు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి హరిచంద్‌తండా పంచాయతీ దేవులతండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పది రోజులు కురిసిన భారీ వర్షాలతో పాఠశాల ఆవరణలో నీరుచేరి, తరగతి గదుల్లో ఉరుస్తుందని తండావాసులు తెలిపారు. ప్రహరీ సైతం కూలిపోయిందన్నారు. సోమవారం విద్యార్థులు పాఠశాలకు రాగా వర్షం నీరు ఆవరణలో ఇంకా ఉందని చెప్పారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వారు కోరారు.


వివరాలు సేకరించాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో నివాస ఇళ్లు కూలిన బాధితుల వివరాలు సేకరించాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లపల్లి తండాతో పాటు పలు గ్రామాల్లో కూలిన ఇళ్లను పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మండల వ్యాప్తంగా కూలిన ఇళ్ల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మెదక్ - రేగోడ్ బస్సు బంద్

రేగోడ్(మెదక్): మెదక్ ఆర్టీసీ బస్సు డిపో నుంచి కొన్ని దశాబ్దాలుగా రేగోడ్ వరకు బస్సు సర్వీసును నడిపారు. దీంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. కానీ వారం రోజుల నుంచి ఆ సర్వీసును రద్దు చేశారని ప్రయాణికులు సోమవారం తెలిపారు. బస్సును బంద్ చేయడంతో జిల్లా కేంద్రం, ఇతర పట్టణాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రద్దు చేసిన బస్సును మళ్లీ పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

తురకల చెరువుకు బుంగ.. వృథాగా నీరు



కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామ శివారు కోనాపూర్‌కు వెళ్లే దారిలోని తురకల చెరువులోకి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిస్థాయిలో నీరు వచ్చింది. చెరువు కుడివైపు ఉన్న తూము ఆవలి వైపు కాల్వ కింది భాగంలో రెండు చోట్ల కట్టకు బుంగలు పడడంతో నీరంతా వృథాగా పోతోంది. కట్టకు ఏర్పడిన బుంగలతో గత మూడు రోజులుగా రెండు బోరు మోటార్ల మేర నీరు వృథాగా పోతుందని, అధికారులు పట్టించుకోవడంల లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

సదరం కోసం స్లాట్ బుక్ చేసుకోండి

నర్సాపూర్: ప్రభుత్వం దివ్యాంగుల కోసం చేపట్టే సదరం క్యాంపులో పాల్గొనేందుకు స్లాట్ బుక్ చేసుకోవాలని సీడీపీఓ హేమభార్గవి తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహిస్తారని ఆమె చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతో నేరాలకు చెక్

- తూప్రాన్ సీఐ శ్రీధర్
- ఆయా గ్రామాల్లో కార్డన్‌సెర్చ్


టేక్మాల్(మెదక్): హెచ్‌ఎంపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని తూప్రాన్ సీఐ శ్రీధర్ అన్నారు. సోమవారం ఉదయం మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దాతల సహాయంతో గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పలువురు దాతలు రూ.40 వేలు విరాళం అందజేశారు. మరికొందరు దాతలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవికాంత్‌రావ్, ఏఎస్‌ఐ శ్రీనివాస్, తూప్రాన్ సర్కిల్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

హెచ్‌ఎంపల్లిలో..

టేక్మాల్(మెదక్): మండలంలోని హసన్‌మహమ్మద్‌పల్లి (హెచ్‌ఎంపల్లి)లో సీఐ జార్జ్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ముగ్గురు ఎస్‌ఐలతో కలిసి మూడు బృందాలుగా విడిపోయి గ్రామంలో వాహనాలను తనిఖీ చేశారు. 36 బైక్‌లను, ఒక ఆటోను సీజ్ చేసి వారి పత్రాలను చూసి, పలు సూచనలు చేసి వారికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. వాహనాలున్న వాళ్లు వాహన ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని అన్నారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సర్పంచ్ లావణ్యరెడ్డి రూ.1.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత, హెల్మెట్‌వాడకం, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టేక్మాల్ ఎస్‌ఐ రమేశ్, రేగోడ్ ఎస్‌ఐ సత్యనారాయణ, అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్, సిబ్బంది ఉన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

బస్తీబాటలో రామాయంపేట మున్సిపల్ ఛైర్మన్ జితేందర్‌గౌడ్


కాలనీలో పర్యటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రామాయంపేట(మెదక్): సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు వారు ప్రతీ కాలనీలో తిరుగుతూ ప్రజల విజ్ఞప్తులను స్వీకరించారు. సమస్యలను స్వీకరించి పరిష్కారం దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, ప్యాక్స్ చైర్మన్ చంద్రం, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్ దేమే యాదగిరి, కోఆప్షన్ మెంబర్స్ అధికారులు, కాలనీ నాయకులు, ఏఈ ఇంజనీరింగ్, మహిళా రిసోర్స్ పర్సన్ హెల్త్ సూపర్‌వైజర్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది, వార్డ్ ఆఫీసర్స్, విద్యుత్ సిబ్బంది, వాటర్ సప్లై సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి


సీసీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

హవేళీఘనపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి శ్రీ మల్లికార్జున దేవాలయం వద్ద సీసీ రూ.10లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి, గ్రామ సర్పంచ్ సంధ్య, మండల సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, మహిపాల్‌రెడ్డి, శ్రీను నాయక్, ఎంపీటీసీ సిద్దిరెడ్డి, చిట్యాల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు చిరంజీవిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గోపాల్‌రావు, భిక్షపతిరెడ్డి ఉన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని రజాక్‌పల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్సీ శేరి సుభాశ్ రెడ్డి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ మేరకు మండలంలోని రజాక్‌పల్లి, అదే గ్రామానికి చెందిన ఖాసీంపూర్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ నిధుల ద్వారా రూ.10లక్షల సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో రజాక్‌పల్లి, చల్మెడ, దామర చెరువు గ్రామాల సర్పంచ్‌లు ధర్మ సునీత, నర్సింహారెడ్డి, శివ ప్రసాద్‌రావు, రజాక్‌పల్లి, చల్మెడ ఉప సర్పంచ్‌లు సత్యనారాయణ, రమేశ్, నార్లాపూర్ ఎంపీటీసీ రాజిరెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ శరత్ పవర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్


నర్సాపూర్: చెక్కులు అందిస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు అండగా ఉంటుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెప్పారు. ఆమె సోమవారం పలువురు లబ్ధిదారులకు హైదరాబాద్‌లోని తన స్వగృహంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. వెల్మకన్నె, సోమక్కపేట లబ్ధిదారులకు సునీతారెడ్డి చెక్కులు అందజేశారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్ పంచాయతీ పరిధిలోని పంతులుపల్లి గ్రామానికి చెందిన సత్తయ్యకు వైద్య ఖర్చుల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీడీఓ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ జిల్లా నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు అశోక్‌గౌడ్, మహేందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్టోజిపల్లి గ్రామంలో నర్సమ్మకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అందించారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ.20 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధిత కుటుంబీకులకు అందించినట్లు ఎంపీపీ తెలిపారు. అనంతరం ఎంపీపీ నిధులతో గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్‌మోటార్‌ను ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందం, పరశురాం, యాదగిరి, నరేశ్, సత్యనారాయణ, నర్సింలు, బాలమణి పాల్గొన్నారు.

127 రోజుకు చేరిన దీక్ష


దీక్షలో అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు సోమవారానికి 127 రోజులకు చేరాయి. ప్రభుత్వం డివిజన్ మంజూరు చేసేవరకు విశ్రమించమని అఖిలపక్ష నాయకులు తెలిపారు. దీక్షకు యువజన, వ్యాపార, కుల సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటించారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

మనోహరాబాద్(తూప్రాన్): మహిళలు స్వయంగా అభివృద్ధి చెందాలని ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి మహిళా సమైఖ్య సంఘంలో గ్రూప్ మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలను అందించడానికి కృషి చేస్తుందన్నారు.

బాధితులకు అండగా ఉంటా

చేగుంట(తూప్రాన్): బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోనాల్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన శ్రీకాంత్‌రెడ్డితో పాటు కిష్టయ్య కుటుంబీకులను మోహన్‌రెడ్డి పరామర్శించారు. జెడ్పీటీసీ యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని మండలంలోని రాయిలాపూర్ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని బూరుగడ్డలో రాయిలాపూర్ సెక్టార్ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: క్రిస్టియన్, మైనార్టీలకు(బీసీ-సీ) వర్గాల వారికి స్వయం ఉపాధి కింద అందించే రూ.1లక్ష సాయం కోసం జిల్లాలోని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు. 21 నుంచి 55ఏళ్ల వయస్సు ఉన్నవారు ఆన్‌లైన్‌లో ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 8142741976 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

తూప్రాన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కరించాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ పేరుతో ఇచ్చిన పిలుపుమేరకు ఆర్డీఓ జైచంద్రరెడ్డికి జిల్లా తపస్ కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీఆర్సీ కమిటీని వేసి, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను వెంటనే విడుదల చేసి సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు రామారావు, ఆయా మండలాల అధ్యక్షులు నాగిరెడ్డి, రంగారెడ్డి, భాను ప్రసాద్, సంతోష్, వేణు, ఉమా దేవి తదితరులు పాల్గొన్నారు.

మెదక్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తపస్ ఆధ్వర్యంలో మెదక్ ఆర్డీఓ అంబదాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం, తపస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింలు, మధుమోహన్, సిద్ధు, నరేందర్, శ్రీకాంత్‌రెడ్డి, భిక్షపతి, రవీందర్, సతీశ్, వీరేశం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు దళితబంధు ఇవ్వాలి


మందాపూర్‌లో ఆందోళన చేస్తున్న దళితులు

అల్లాదుర్గం(మెదక్): అర్హులైన ప్రతీ కుటుంబానికి దళితబంధు ఇవ్వాలని సోమవారం మండలంలోని మందాపూర్ గ్రామంలో 30 దళిత కుటుంబాలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో వందలాది దళిత కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయని, రెండు, మూడు కుటుంబాలు బాగుపడేలా దళితబంధు కింద ఎంపిక చేయడం సమంజసం కాదన్నారు. కూలి పని చేస్తేనే కుటుంబం గడిచే దళిత కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, కొందరికి మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామాల్లో అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రతీ ఒక్క కుటుంబానికి ఈ పథకం వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో దళిత కుటుంబాల సభ్యులు మాణయ్య, దామర్‌చర్ల శంకరయ్య, అందోల్ రామయ్య, కర్రోల్ల లక్ష్మయ్య, డప్పు జానాయ్య, మాణేమ్మ, జంగిలి రాజమ్మ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టా సర్టిఫికెట్‌లు అందజేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 341లో ఉన్న 292 ఎకరాల ప్రభుత్వ భూమి విషయమై కొంతకాలంగా అధికారులు, రైతులకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ భూమిని గ్రామానికి చెందిన 92 మంది రైతులకు కేటాయిస్తూ గతంలో రెవెన్యూ అధికారులు పట్టా సర్టిఫికెట్‌లు అందజేశారు. కాగా ఇందులో కొంత భాగం అటవీ, మరికొంతభాగం రెవెన్యూ శాఖకు చెందుతుందని అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మధ్య వివాదం నడిచింది. ఈ విషయమై పలుమార్లు రెండు శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టి 105 ఎకరాలు అటవీశాఖకు చెందిదని, మిగతా భూమి రెవెన్యూ శాఖకు చెందిన ప్రభుత్వ భూమిగా తేల్చారు. ఈ భూ విషయంలో గతంలో సర్టిఫికెట్‌లు పొందిన లబ్ధిదారులకు ధరణి పట్టాపాస్‌బుక్‌లు అందజేయాలని కోరుతూ సోమవారం రైతులు తహసీల్దార్ నాగవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. వీరికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు అశోక్ రెడ్డి, నాయకులు కృష్ణ, ఖాజా, మహేందర్‌రెడ్డిలు సంఘీభావం ప్రకటించారు.

విద్యార్థి కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత

హవేళీఘనపూర్: ఇటీవలే మృతి చెందిన మండల కేంద్రం హవేళీఘనపూర్‌కు చెందిన కడమంచి నర్సింలు కుటుంబానికి హవేళీఘనపూర్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందజేశారు. తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి నర్సింలు మృతి చెందడంపై వారు సంతాపం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల నిరసన

రామాయంపేట(మెదక్)/ పెద్దశంకరంపేట(మెదక్)/ నిజాంపేట(మెదక్)/ మనోహరాబాద్(తూప్రాన్): జిల్లా వ్యాప్తంగా సోమవారం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. 26 రోజులుగా కార్మికులు చేస్తున్న సమ్మెకు నార్సింగి మండల బీజేపీ నాయకులు తమ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘాల అధ్యక్షులు, కార్మికులు పాల్గొన్నారు.

అలుగుపారుతున్న పెద్ద చెరువు


పూజలు చేస్తున్న మున్సిపల్ పాలక వర్గం సభ్యులు

తూప్రాన్: పట్టణంలోని తూప్రాన్ పెద్ద చెరువు నిండు కుండలా తలపిస్తుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సోమవారం అలుగుపారింది. దీంతో మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పాలక వర్గం సభ్యులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **27న బోనాల పండగ**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఈనెల 27న బోనాల పండగను నిర్వహించనున్నట్లు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బోనాల పండగపై గ్రామస్తులతో చర్చించారు. శ్రావణమాసంలో 27న నిర్వహించేందుకు తీర్మానం చేశారు.

◆ **సన్మానం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌లో ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ మహ్మద్‌గౌస్‌ను సోమవారం కొత్తగా వచ్చిన ఎస్‌ఐ షేక్ మహబూబ్‌తో పాటు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

◆ **చిలప్‌చెడ్ ఎస్‌ఐగా షేక్ మహబూబ్**

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండల ఎస్‌ఐగా షేక్ మహబూబ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంతకుముందు సిద్దిపేట జిల్లా రాయిపోల్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వర్తించానన్నారు.

◆ **విరాళం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్ గేట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి అలయానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనీల్‌కుమార్ రూ. 50వేలు విరాళం అందజేశారు. సోమవారం ఆలయానికి వచ్చిన సందర్భంగా గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆలయ నిర్వాహకులు ఆయన నగదు అందచేశారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగెట్స్ ఆంజనేయులుగౌడ్, రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్థికసాయం**

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్‌లో అర్చకుడు కుటుంబానికి వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కిషన్‌రావు ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన అర్చకుడు వేణు సతీమణి కావేరి ఇటీవల మృతి చెందింది. దీంతో దశదిన కర్మ ఖర్చుల కోసం ఆయన రూ.17,500లను అర్చకుడికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు వడ్ల రాజు, గుర్రాల రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **చండిలో..**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చండి గ్రామానికి చెందిన ఉషిగారి మల్లమ్మ, గూడెపు బాలయ్య అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలకు జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమా, ఉప సర్పంచ్ ఎల్లం, వెంకటేశ్వరావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

◆ **శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా**

మనోహరాబాద్(తూప్రాన్): శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని మనోహరాబాద్ నూతన ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్ ఎస్‌ఐగా పని చేసిన సందీప్‌రెడ్డి సీఐగా ప్రమోషన్ పొంది, మెదక్ ఎస్పీ కార్యాలయం ఎస్బీ విభాగంసెల్‌కు వెళ్లారు. నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐని పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, తూప్రాన్ పీఏసీఎస్ డైరెక్టర్ జావీద్‌పాషా, బీఆర్ఎస్ నాయకులు కలిసి సన్మానించారు.

◆ **పల్లెలకు క్రీడా సామగ్రి**

నర్సాపూర్: గ్రామాలకు ప్రభుత్వం క్రీడా సామగ్రి సరఫరా చేయగా, సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి క్రీడా సామగ్రి చేరింది. నర్సాపూర్ మండలంలో 35 కిట్స్ వచ్చాయి.

◆ **నియామకం**

రేగోడ్(మెదక్): సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడిగా గంగా సంతోష్ (సీఆర్‌పీ), ప్రధాన కార్యదర్శిగా స్వయంప్రభ (కేజీబీవీ ప్రిన్సిపాల్)లు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వడ్ల సత్యనారాయణ, కోశాధికారిగా శ్వేత (ఎంఐఎస్), సోషల్ మీడియా కో ఆర్డినేటర్లుగా సిద్దప్ప (ఎంఆర్‌సీ కంప్యూటర్ ఆపరేటర్), రవి (సీఆర్‌పీ)లను ఎన్నుకున్నారు.

◆ **సన్మానం**

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట నూతన ఎస్‌ఐగా నారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే చిన్నశంకరంపేట నుంచి సిద్దిపేట జిల్లా చిన్నకోదూరుకు బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్‌ని, నూతన ఎస్‌ఐని రుద్రారం గ్రామ పాలకువర్గం సోమవారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

◆ **బీవీఆర్‌ఐటీలో ఆగస్టు 3 నుంచి ఐపెక్ కార్యక్రమాలు**

నర్సాపూర్: బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో ఆగస్టు 3 నుంచి 5 వరకు ఐపెక్ 2023 కార్యక్రమం ఉంటుందని కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్ దూబె తెలిపారు.

◆ **గడ్డి మందు స్ప్రే**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామంలో మురికి కాల్వలపై గడ్డి మందు స్ప్రే చేశారు. సోమవారం మండలంలోని జంగరాయి గ్రామంలో సర్పంచ్ జ్యోతిప్రభాకర్ ఆధ్వర్యంలో మురికి కాల్వల పక్కన గడ్డి మందు స్ప్రే చేశారు.

◆ **గంగమ్మకు ఒడిబియ్యం**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట చెరువువద్ద గంగమ్మ తల్లికి సోమవారం ఎంపీటీసీ వెంకటలక్ష్మి ఒడిబియ్యం పోసి, పూజలు చేశారు.

◆ **కూలిన ఇళ్ల పరిశీలన**

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో కూలిన ఇళ్లను సర్పంచ్ ఉమాదేవి ఆధ్వర్యంలో ఆర్ఐ ప్రభాకర్ పరిశీలించారు. గ్రామ ఉపసర్పంచ్ చెన్నయ్య, కారోబార్ ప్రభాకర్, రాజాగౌడ్ ఉన్నారు.

◆ **విద్యార్థినిలకు కంటి పరీక్షలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గూడూర్ గ్రామంలో ఉన్న కస్తూర్బా గిరిజన బాలికల వసతి గృహంలో సోమవారం పీహెచ్‌సీ కంటి వైద్యుడు మోహన్‌చారి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.

◆ **కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి**

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట గ్రామ శివారులోని నోవల్‌టెక్ పరిశ్రమ నుంచి అకారణంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులకు సంఘీభావం ప్రకటించి ధర్నాలో కూర్చున్నారు.

◆ **నేడు ఛలో రాజ్‌భవన్‌కు తరలిరావాలి**

మెదక్ కలెక్టరేట్: నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నేడు ఛలో రాజ్ భవన్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు. విద్యను ప్రైవేట్‌పరం చేయడంతో పేదలకు విద్య అందకుండా పోతుందని, దీనికి నిరసనగా కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

◆ **మరో చోట ఏర్పాటు చేయాలి**

మెదక్ మున్సిపాలిటీ: రోడ్డు వెడల్పులో భాగంగా జంక్షన్‌ను మరోచోట ఏర్పాటు చేయాలని 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు కోరారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్‌కు వినతి పత్రం అందించారు. ఎల్కతుర్తి-మెదక్ హైవే జంక్షన్‌తో పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని, మరోచోటుకు మార్చాలనికోరారు.

◆ **న్యాయం చేయాలి**

మెదక్ కలెక్టరేట్: గ్రామ సేవకులు, నీరుడి ఈసదారులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. తాతల కాలం నుంచి వృత్తిలో ఉన్నామని, ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.